# మంచి చెడ్డలు

శ్రీమతి ఉప్పులూరి వెంకటసత్యవతిగారు

నారాయణ రావు గారు తాలూకా ఆఫీసులో హెడ్ ఎకౌంటెంటు. వీరికి యిద్దరు మొగపిల్లలు. ఇద్దరు ఆడపిల్లలు. భార్యపేరు పద్మావతి. ఈవిడ మంచి రూపసి. అత్తలేని కోడలు ఉత్తమురాలు, కోడలు లేని అత్త గుణవంతురాలు - అని మన పెద్దలు అన్నట్లుగా ప్రస్తుతము పద్మావతమ్మగారు గుణవంతురాలనే చెప్పవచ్చును. వారి పెద్ద కుమారుని పేరు బుద్ధీశ్వరరావు. రెండవవాడి పేరు శ్రీధర్. పెద్దవాడు బి. ఎ. చదువుతుండగా జోగారావుగారనే High School Headmaster గారి చిన్న కూతుర్ని యిచ్చి పెండ్లి చేసినారు. ఈమె పేరు సుశీల. చామనచాయ రంగు. కొద్దిగా చదువు; సంగీతము వచ్చును. రూపసి కాదు, అనాకారి కాదు. సామాన్యంగా వుండేది. అసలు ఈ సంబంధం చేసికోవటం పద్మావతమ్మగారికి యిష్టమే లేదు. ఇదంతా వియ్యంకులకున్నటువంటి బాల్యస్నేహాన్నిబట్టి జరిగిన సంబంధం. పాపం నారాయణరావు గారు ఈ రోజులలో మాదిరిగా కట్నము, చదువూ, అందమూ చూచుకోలేదు. పూర్వపు రోజులలో మాదిరిగా సాంప్రదాయకమైన కుటుంబమని, పిల్ల బుద్ధిమంతురాలని చేసికున్నారు. కొన్నాళ్లకు సుశీల కాపరానికి వచ్చింది. పాపం ఈమె చాలా అమాయకురాలు. అత్తగారికి ఈవిడంటేనే గిట్టేదే కాదు. ఏపని చేసినా పనికి వచ్చేదే కాదు. తనలాగా తెల్లగా లేదని, తెలివిగలది కాదని విసుక్కుంటూ వుండేది. ఎవరైనా మీ కోడలు ఏదమ్మ అని అడిగితే "అదిగో, మా ఏనాది" అని అంటూ వుండేది. ఒక రోజున యీ అమ్మాయి బిందెతో నీళ్లు తెస్తుండగా చెయ్యిజారి బిందె పడి సొట్టపడింది. అత్తగారు బిందె సొట్టపోయిందని దిగులుపడిందే గాని, పాపం అమాయకురాలైన సుశీల బొటనవ్రేలు చితికి నెత్తురు కారుతుంటే చూడనైనా చూడకుండా రివ్వున ఆ బిందె తీసికొని వెళ్లింది.

ఇది యిట్లా వుండగా శ్రీధర్‌కు కూడా పెళ్లి అయింది. ఆ అమ్మాయి పేరు మోహిని. ఆమె, తండ్రికి ఒక్కతే ఆడపిల్ల. అందుకని చాలా గారాబంగా పెరిగింది. ఈమె చక్కనిది. చదువుకున్నది. ఒదినగారిమీద తన తల్లి విసుక్కోవటం చూచి, శ్రీధర్ తన భార్య వచ్చిన తర్వాత తల్లికి అడుక్కు మడుగులొత్తిస్తానని అంటుండేవాడు. మోహిని కూడా కాపరానికి వచ్చింది. అతి సుకుమారి. పుట్టినయింట గారాబముగా పెరిగిన వలన మెట్టిన యింట పనిపాటలు చేయలేక పోవుచున్నది. అస్తమానమూ నీటుగా వుండటమూ, క్లబ్బులకు వెళ్లటమూ, సినిమాలకు వెళ్లటము బాగా చేతనవును. ఈ విధంగా వున్నా అత్తగారికి చిన్న కోడలుమీద ఎక్కువ మమత. చదువుకున్న పిల్ల అని, సుకుమారి అని, ఏమీ అనేది కాదు. పాపం, శ్రీధర్‌కు కూడా అదే భయము. తల్లికి అడుగుకి మడుగులు వొత్తించకపోగా దవడలు రెండూ ఒత్తించినాడు.

ఇట్లా వుండగా మండు వేసవికాలము వచ్చింది. పద్మావతమ్మగారు ప్రసవించినది. ఇంట్లో అందరికి జ్వరాలు పట్టుకున్నవి. ఇంటి చాకిరి అంతా అమాయకురాలైన సుశీల మీద పడింది. మోహిని, యింట్లో ఈ విధంగా వుండటం చూచి ఒక Plan వన్నింది. నాకిక్కడ ఎండలు ఎక్కువగా వున్నవి. భరించటం కష్టమని Bangalore ప్రయాణం కట్టింది. ఎవరూ ఏమీ అనలేక వూరుకున్నారు. ఆవిధంగా చిన్న కొడుకూ, చిన్నకోడలూ వెళ్లిపోయినారు. ఇప్పుడు అత్తగారికి ఎవరు మంచిదైనది తెలిసింది. ఇటువంటి పరిస్థితులలో మంచి చేసికొనలేకపోతే గత్యంతరం లేదని పెద్ద కోడలితో ఎంతో ప్రేమగా వుండటం మొదలు పెట్టింది.

చివరకు దుప్పి సామితగా ముందువచ్చిన చెవులే మంచివైనవి.